క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

సత్యవేడు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని చెప్పారు. మండల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, సింగిల్ విండో అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

సత్యవేడు: మండల పరిధిలోని వీఆర్ కండ్రిగలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిధులు మంజూరు కావడంతో పనులు మొదలుపెట్టారు. జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, సర్పంచ్ ఎస్.సుజాత, పార్టీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, ఢిల్లిబాబు యాదవ్, ఏఈ దేవిప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కేవీబీపురం: మండలంలోని కొత్తూరు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో దళితులు చేపట్టిన నిరాహార దీక్ష గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఎం రైతు విభాగం జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ మాట్లాడుతూ.. గ్రామంలోని గ్రామకంఠ భూముల్లో జగనన్న కాలనీ నిర్మిస్తున్నప్పటికీ కొందరు అర్హులను విస్మరించడం దారుణమన్నారు. సొంతిళ్లు ఉన్న వారికి మళ్లీ ఇళ్ల స్థలాలు ఇవ్వడం సరికాదన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మధ్యాహ్నభోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈఓ రవీంద్రనాథ్ అన్నారు. గురువారం కంచనపుత్తూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. భోజనశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పల్లిపట్టుకు ఆహ్వానం



వరదయ్యపాళెం: సామిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్టు 3 నుంచి 6వ తేదీ వరకు భోపాల్‌లో జరగనున్న 'ఉన్మేష్ అంతర్జాతీయ సాహిత్య ఉత్సవాలకు' తిరుపతి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు, కవి, రచయిత, యాలై పూడ్చింది కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు ఆహ్వానం అందుకున్నారు. 70 దేశ, విదేశ భాషల్లో 500మంది ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. యువ కవిత్వం విభాగంలో నాగరాజు పాల్గొని తన స్వీయ కవితలు తెలుగుతో పాటు వాటి అనువాదాలు హిందీ, ఇంగ్లిష్ భాషల్లో వినిపించనున్నారు. పల్లిపట్టు ప్రస్తుతం వరదయ్యపాళెం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



శ్రీశాంత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో మహానంది ఆలయ చైర్మన్ కొమ్మ మహేశ్వరరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు ఆశీర్వచనం అందించగా.. అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నవరత్నాలతోనే పేదల అభ్యున్నతి





ఏర్పేడు: గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తి: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పంగూరు పంచాయతీలో గురువారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ నాయకులు క్రేన్ ద్వారా ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి పూలవర్షం కురిపించారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేసి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. గ్రామాల్లోని 340 గడపలకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. పంగూరు, బీసీ, అరుంధతీవాడ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, మురుగునీటి కాల్వల నిర్మాణాలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే దానికి కారణమన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు 11 రకాల ధృవీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కారాదన్నదే ప్రభుత్వ ధ్యేయమని వెల్లడించారు. జగనన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండి మళ్లీ సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత వైస్ ఎంపీపీలు జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, సర్పంచ్ లక్ష్మీప్రసన్న, మాజీ ఎంపీటీసీలు చాముండేశ్వరి, రమణయ్య యాదవ్, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, పోలయ్య, సురేష్‌రెడ్డి, కిరణ్ నాయుడు, మునిరత్నం నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆమందూరు పరిధిలో..

మండలంలోని ఆమందూరు సచివాలయ పరిధి దుర్గిపేరి, నాగంపల్లి, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శుక్రవారం మధ్యాహ్నం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఎంపీడీఓ గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు.

జగనన్న సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష

శ్రీకాళహస్తి: జగనన్న సురక్ష రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత కలిగిన వారు వందశాతం సంక్షేమ పథకాలకు లబ్ధి పొందాలనే సంకల్పంతో 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. జూలై 1 నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు చేర్చే ప్రయత్నం చేశారన్నారు. శ్రీకాళహస్తిలో స్థలానికి చెందిన 100 అర్జీలకు పరిష్కారం చూపామన్నారు. ఇతర సర్టిఫికెట్ల కోసం 71,494, వినతులు రాగా 68,663 మందికి సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. తద్వారా జగనన్న సుపరిపాలన ప్రజలకు చేరువైందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నం వాసునాయుడు, హరిప్రసాద్ రెడ్డి, వయ్యాలకృష్ణారెడ్డి, నాని, జయగోపాల్, రమేష్, గో రా, హరినాయాఉడు, ఉదయ్‌కుమార్, పసల కృష్ణయ్య, శ్రీనివాసులు, చింతా రాజేంద్ర, యోగీశ్వర్నాథ్‌రెడ్డి, గాదిపాకుల కిరణ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యానికే సంపూర్ణ పోషణ

- కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆదిమూలం



పిచ్చాటూరులో గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు: తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గురువారం సాయంత్రం పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలపై మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వచ్చే పనిలేకుండా నేరుగా ఇంటికే సరుకులు చేరే విధంగా చేశారన్నారు. సొంత అన్న కూడా ఆలోచన చేయలేనంతగా ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ శోభారాణి, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మధుసూదన్ రావు, పీఆర్, హౌసింగ్ డీఈలు మధుసూదన్, వైఎస్సార్‌సీపీరాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, చలపతిరాజు, తొప్పయ్య, చెంగల్రాయ రెడ్డి, ఆర్ముగం రెడ్డి, మోహన్, సుబ్రమణ్యం, బాబు రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం



అవగాహన కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

బుచ్చినాయుడుకండ్రిగ: తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమని, ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లి పాలే పట్టాలని పల్లమాల సర్పంచ్ జొన్నల రమణమ్మ అన్నారు. గురువారం పల్లమాల గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో ప్రజాప్రగతి ట్రస్టు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రగతి ట్రస్టు కో–ఆర్డినేటర్ సుబ్రమణ్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు సుపర్ణణి, సుధారాణి, సహాయకులు రుక్మిణమ్మ, శశిరేఖ పాల్గొన్నారు.

కొత్తవీరాపురంలో..

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం అంగన్ వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌బాబు మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ రత్నమ్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎంవీ కండ్రిగలో..

శ్రీకాళహస్తి: మండలంలోని టీఎంవీ కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఘనంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ప్రజా ప్రగతి ట్రస్టు, గ్రామ సచివాలయ వైద్య ఆరోగ్యసిబ్బంది ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నిర్వహించారు. ప్రజాప్రగతి కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హేమశ్రీ, వెల్ఫేర్ అసిస్టెంట్ దివ్య, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత



నగదును అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలకు గురువారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆర్థిక సాయం చేసి చేయూతనిచ్చారు. కుక్కలగుంట ఎస్టీ కాలనీకి చెందిన రామస్వామి, రెడ్డిగుంట ఎస్టీ కాలనీకి చెందిన గంగులమ్మ, గుండ్లకండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన రమణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు గున్నేరి కిషోర్‌రెడ్డి ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేలు నగదును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయముని, వైఎస్సార్ సీపీ నాయకులు మధు యాదవ్, మధుసూదన్‌రాజు సలాంరాజు పాల్గొన్నారు.

కమిషనర్ రమేష్‌బాబుకు సన్మానం



కమిషనర్ రమేష్‌బాబును సన్మానిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పురపాలకసంఘ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రమేష్‌బాబును గురువారం పానగల్ దర్గా కమిటీ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో గతంలో పనిచేసిన సమయంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు గుర్తు చేశారు. తిరిగి మళ్లీ బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఠాధిపతులు సయ్యద్‌అహ్మద్, బాబా ఫరీద్, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, జమ్రుద్‌బాషా, రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చెరకు తోట దగ్ధం : రూ. 2లక్షల నష్టం



కార్వేటినగరం: మండల పరిధిలోని ఏబీసీ మామిడి కాయల జ్యూస్ ఫ్యాక్టరీ సమీపంలో గురువారం రాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధమైంది. బాధితుని కథనం మేరకు.. ఎంఎం విలాసం పంచాయతీ మాకమాంబ విలాసపురం దళితవాడకు చెందిన మురళీ కృష్ణ (దివ్యాంగుడు) జ్యూస్ ఫ్యాక్టరీకి ఎదురుగా రెండు ఎకరాలు చెరకు సాగు చేశాడు. గురువారం రాత్రి విద్యుత్ స్తంభం నుంచి జంపర్ ఊడి తీగలపై పడడంతో నిప్పురవ్వలు ఎగిరిపడ్డాయి. వాటి ద్వారా పక్కనే ఉన్న చెరకు తోటకు మంటలు వ్యాపించాయి. స్థానికులు పుత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసే లోపే చెరకుతోట పూర్తిగా కాలి బూడిద అయ్యింది. పంట చేతికి అందే సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో రూ. 2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు మురళీ కృష్ణ కన్నీరు మున్నీరైయ్యాడు

ఆయిల్‌పామ్ మొక్కల పెంపకంపై అవగాహన

శ్రీకాళహస్తి: మండలంలోని వేలవేడులో గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన జిల్లా ఉద్యాన అధికారి దశరథ రామిరెడ్డి, ఉద్యాన అధికారి పుష్పలత మాట్లాడుతూ, గత ఏడాది మండలంలో 52 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటల పెంపకం చేపట్టారని చెప్పారు. ఈ సారి కొత్తగా ఆయిల్‌పామ్ తోటలు పెంపకం చేపట్టదలచినవారు ఉద్యానవన అధికారిని సంప్రందించాలని వారు కోరారు.

సర్వేయర్ లేక అవస్థలు



మూతపడిన సర్వేయర్ గది

బుచ్చినాయుడుకండ్రిగ: రెండు నెలలుగా మండల సర్వేయర్ లేకపోవడంతో మండల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జనవరిలో ఇక్కడ పనిచేస్తున్న సర్వేయర్ మునస్వామి అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. నాగలాపురంలో పనిచేస్తున్న అరుణకు మారిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈమెకు మే నెలలో పదోన్నతి రావడంతో కడపకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి సర్వేయర్ లేదు. సర్వే కోసం చలానాలు కట్టి తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా ఉపయోగం లేకుండాపోతోందని బాధితులు వాపోతున్నారు. సచివాలయాల సర్వేయర్లు భూముల రీసర్వే కోసం ఓజిలి మండలంలో పనిచేస్తున్నారు. ఉన్నతాధికారుల స్పందించి మండల సర్వేయర్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జయేంద్ర సరస్వతి జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో కంచి కామకోటి పీఠాధిపతులు

నగరి: కీళపట్టు చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గురువారం కంచికామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి జయంతి వేడుకలు, ఆడిపెరుక్కు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పీఠాధిపతుల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించారు. ఆడిపెరుక్కు ఉత్సవం కొలనులు, చెరువుల్లో నీటి వృద్ధికి ప్రత్యేకం కావడంతో ఆలయ కొలనులో జలాభిషేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు జలగడం సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్షుణ్ణంగా ఓటర్ల సర్వే

గంగాధరనెల్లూరు: ఓటర్ల జాబితాను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్వోలు, తహసీల్దార్, డీటీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటరు నమోదులో మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. బీఎల్వోలు ప్రత్యేక రికార్డు నిర్వహించాలన్నారు. తహసీల్దార్ ఇన్బనాథన్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో మార్పు కనిపిస్తోంది



మహిళలకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగు
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం సత్యవేడు 4వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేయూతనందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. 4వ సచివాలయ పరిధిలో 886 కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 12.35 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. జగనన్న అమ్మ ఒడి 247 మందికి, పేదలందరికీ ఇళ్లు 185, వైఎస్సార్ పింఛన్ కానుక 451, వైఎస్సార్ బీమా 865, జగనన్న విద్యాకానుక 124, వైఎస్సార్ సున్నావడ్డీ 739 మందికి, వైఎస్సార్ ఆసరా 658, వైఎస్సార్ చేయూత 215, విద్యాదీవెన 111 మందికి అందించినట్లు వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు


సత్యవేడు దళితవాడ పరిధిలో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని, ఇళ్ల స్థలాలు, అంగన్‌వాడీ సెంటర్‌కు భవన వసతి కల్పించాలని పలువురు కోరారు. దళితవాడలో శిథిలమైన అంగన్‌వాడీ కేంద్రం తొలగించి కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీడీపీఓ దేవకుమారిని ఎమ్మెల్యే ఆదేశించారు.

గర్భిణులకు సీమంతం

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ముగ్గురు గర్భిణులకు (దీప, గంగ, నళిని)కి సీమంతం చేశారు. ఎమ్మెల్యే వారిని ఆశీర్వదించారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం కోసం పోషకాహారం అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ షేక్ జరీనా బేగం, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, ఎంఈఓ రవి, జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సోమశేఖర్, వెంకటరత్నం, గురుప్రసాద్, పళణి, షీలా, జోషెఫ్, రాబిన్, మాణిక్యం, కృష్ణయ్య, శాంతి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు ఇప్పిస్తాం

- డీఆర్‌డీఏ పీడీ జ్యోతి
- వెలుగు అక్రమ రుణాలపై విచారణ



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ జ్యోతి

వరదయ్యపాళెం: డ్వాక్రా సంఘాల్లో అర్హత కలిగిన ప్రతి సంఘానికి రుణాలు ఇప్పిస్తామని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి అన్నారు. మండలంలో పలు డ్వాక్రా సంఘాలకు బ్యాంకులు రుణాలు ఇవ్వక ఇబ్బంది పడుతున్న విషయమై స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం డీఆర్‌డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పీడీ గురువారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో వెలుగు సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. గతంలో జరిగిన అక్రమ రుణాలు, బినామీ గ్రూపులతో అడ్డగోలుగా వెలుగు ఏపీఎం, సిబ్బంది చేసిన అక్రమాలపై ఆమె విచారణ చేశారు. ప్రధానంగా రుణాలు బ్యాంకులకు చెల్లించి సిబ్బంది తీసుకున్న అక్రమ రుణాల కారణంగా రుణాలు పొందలేని డ్వాక్రా సంఘాల వివరాలను ఆమె పరిశీలించారు. డ్వాక్రా సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బంది సంయుక్తంగా తెలిపిన వివరాలకే సంతకాలు పెట్టాలని, ఇతరత్రా వాటిపై సంతకాలు చేసి మోసపోవద్దని సూచించారు. ప్రతిఒక్కరికీ రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, అందుకు సంబంధించి బ్యాంకు మేనేజర్లకు రాతపూర్వకంగా ఆదేశాలిచ్చారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, బందిల సురేష్, సర్పంచ్ దుడ్డు వేణు పాల్గొన్నారు.

కళింగ నర్తనునిగా గోపాలుడు



నగరి: మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న తిరనాళ్లలో భాగంగా గురువారం రాత్రి కళింగ నర్తనునిగా శ్రీకృష్ణుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపుగా వచ్చిన స్వామివారికి ప్రతి ఇంటి వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. బాణాసంచా వేడుకల నడుమ ఊరేగింపు వైభవంగా సాగింది. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ నటరాజన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.